# సంస్కారం

---

పాట్నా జంక్షన్ నంబర్ వన్ ప్లాట్‌ఫామ్ మీద నుంచున్న భారతి వాచ్ వంక విసుగ్గా చూసింది. ట్రెయిన్ దానాపూర్ స్టేషన్ దాటేసిందని యిందాకే చెప్పాడు ఎంక్వయరీ మహానుభావుడు. యింత వరకు అజా, పజా లేదు. మధ్య పుల్‌వారీ స్టేషన్‌లో పడుకోలేదు కదా!

"హలో! భారతి గారూ!" తెలుగు కంఠం వినిపించేసరికి ప్రాణం లేచివచ్చినట్లయి సంతోషంగా అతని వంక చూసింది భారతి.

"హలో" భారతి విష్ చేస్తూ వుండగానే, ఎదురు చూస్తున్న ట్రెయిన్ వచ్చింది.

"ఓ ఫ్రెండ్‌కి సెండాఫ్ యివ్వడాని కొచ్చాను. మీరిలా వచ్చా రేంటి? మీవారు గాని వస్తున్నారా?" చనువుగా, అప్యాయంగా, హద్దులు మీరకుండా మాట్లాడే ప్రసాదరావంటే ఎంతో యిష్టం భారతికి. ఎప్పు డైనా అతను కనిపించి మాట్లాడితే ఆత్మబంధువును చూచినట్లుంటుంది.

"అబ్బే! లేదండి. తనకు లీవ్ దొరకదిప్పుడు" భర్త ప్రసక్తి రాగానే భారతి హృదయంలో చిన్న కెరటం లేచి చెక్కిళ్ళు కందాయి. భారతి చెప్తూ వుండగానే, వేగం తగ్గి ఆగబోతున్న ట్రెయిన్ లోంచి ఒకతను భారతిని చూచి నవ్వుతూ చెయ్యూపాడు.

అతన్ని చూడగానే భారతి ముఖం కళ కళ లాడి పోయింది ట్రెయిన్ ఆగగానే ఒక్క అంగలో ప్లాట్‌ఫామ్ మీదికి దూకాడతను. ప్రసాదరావు ఉనికిని మరిచిపోయినట్లుగా భారతి వడివడిగా సారధి వైపు నడిచింది.

"భారతీ!" సంభ్రమంగా భారతి వంక చూస్తూ వుండిపోయా డతను.

"నీ కోసం ఎన్ని యుగాల నుంచి యీ చలిలో వెయిట్ చేస్తూ న్నానో తెలుసా!"

అప్యాయంగా సారధి వంక చూసింది భారతి.

"రియల్లీ....?! ఎంత అదృష్ట వంతుడిన్నేను!!" మెరుస్తున్న కళ్ళతో భారతి వంక చూశాడు సారధి,

"అన్యాయం భారతి గారూ!" ఉలిక్కిపడి ప్రసాదరావు వైపు తిరిగింది భారతి.

"అయామ్ సారీ! ఎక్స్ట్రీమ్‌లీ సారీ ప్రసాద్‌గారూ! సారథీ! వీరు పాట్నా యూనివర్శిటీ ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో పిహెచ్. డి. చేస్తున్నారు. ప్రసాద్ గారూ! ఇతను నా ఫ్రెండ్ సారథి. బెంగుళూరులో పనిచేస్తున్నాడు. ఢిల్లీలో ఏదో పనుండి వచ్చి దగ్గర్లోకి వచ్చాను కదా అని నన్ను చూడడానికి వచ్చాడు"

"యీమె డాక్టర్ భారతి అని నా ఫ్రెండ్ ప్రసాద్‌గారూ! ప్రిన్స్ వేల్స్ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్" చిలిపిగా భారతి వంక చూశాడు సారథి. 'యితను నా ఫ్రెండ్' అని ధైర్యంగా చెప్తున్న భారతి వంక ఒక క్షణం ఆశ్చర్యంగాచూసి మళ్ళీ మామూలుగా అయిపోయాడు ప్రసాద్.

కాసేపు స్టేషన్‌లోనే నుంచుని కబుర్లు చెప్పుకుని బయటి కొచ్చే ప్పటికి పాట్నా నగరాన్ని కౌగిలించుకున్న భయంకరమైన చలి చెంపలకు తాకింది.

"ప్రసాద్ గారూ! యిక్కడ భారతి హాస్టల్‌కి దగ్గర్లో మంచి హోటలేదైనా వుందా?"

"అదేమిటండీ? భలేవారు. హోటల్లో వుండడమేమిటి? భారతిగారి హాస్టల్‌కి దగ్గర్లోనే కదమ్‌క్వాన్‌లో వుంది మా రూమ్. మా రూమ్‌కి వెళ్దాం. ప్రసాద్ హడావిడికి ఒక ప్రక్క సంతోషంగావున్నా, యీ చలిరాత్రిలో మరో ఒరియా స్టూడెంట్‌తో ఆ జానెడు గదిలో కలిసి వుంటున్న అతన్ని యిబ్బంది పెట్టడ మిష్టం లేకపోయింది భారతికి.

"ఎందుకు? ఒద్దండీ, సారథి హోటల్లో వుంటాడు" గబ గబ అనేసింది భారతి.

"అదేం కుదరదు. నేను కలవక పోతే వేరే సంగతి. కలిశాక అతిథి మర్యాద చెయ్యకుండా వదుల్తానను కున్నారా?" చనువుగా సారథి చేతిలో సూట్‌కేస్ తీసుకుని రిక్షా ఎక్కి కూర్చున్నాడు ప్రసాద్.

"రండి సారథిగారూ! గుడ్‌నైట్ భారతిగారూ!" ఇంకో రిక్షా వాడిని పిలిచి మేమ్ సాబ్‌ని మెడికల్ కాలేజీ హాస్టల్‌కి తీసుకు వెళ్ళమని పురమాయించి దాదాపు బలవంతంగా సారథిని తన రిక్షాలో కూర్చో బెట్టుకుని వెళ్ళిపోయాడు ప్రసాద్.

"భలేవాడు" అనుకుంటూ రిక్షా ఎక్కింది భారతి. తమకు ఇబ్బంది అయినా తన ఫ్రెండ్‌ని అంత అప్యాయంగా తీసుకెళ్తూంటే భారతి హృదయం ఆనందంతో, కృతజ్ఞతతో పొంగిపోయింది.

మరునాడు సాయంత్రందాకా సారథితో కలిసి పాట్నా నగరంలో చూడాల్సిన ప్రదేశాలన్నీ చూస్తూ కబుర్లు చెప్పుకున్నా అతను వెళ్ళి పోతూంటే తనను తాను నిగ్రహించుకో లేక పోయింది. భారతి క్రమ క్రమంగా ట్రెయిన్ కనుమరుగవుతూంటే కళ్ళు సన్నటి పొర కప్పిన ట్లయి మసకబారాయి. ప్రసాద్ భారతి వంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు

"భారతిగారూ!" ఉలిక్కిపడి కళ్ళల్లోని చెమ్మని దాచుకుంటానికి ప్రయత్నిస్తూ ప్రసాద్ చూపుల్ని తప్పించుకుంది భారతి.

"రండి, అలా నడుచుకుంటూ వెళ్ళి భారత్ కేఫ్‌లో వేడివేడి దోసె ఇడ్లీ, సాంబార్ తినేసి వెళ్దాం" అతని వంక కృతజ్ఞతగా చూసింది భారతి. కాని అతని వెంట వెళ్ళి తినడానికి మొహమాట పడింది.

"ఒద్దు యిప్పుడేం తినాలని లేదు. హాస్టల్‌కి వెళ్ళి పోతాను."

"అలా అంటే ఒదుల్తా ననుకున్నారా? అదేం కుదరదు. పదండి, పదండి." ఒద్దనుకుంటూనే ఖచ్చితంగా ఒద్దని చెప్ప లేక అతని వెంట నడిచింది భారతి.

"భారతి గారూ! సారథిగారు మీకు బాగా క్లోజ్ ఫ్రెండనుకుంటాను." నిరుత్సాహంగా, అన్యమనస్కంగా చేతిలోని నీళ్ళ గ్లాసు వంక చూస్తూ భారతిని అడిగాడు ప్రసాద్.

"అవును. అందులోనూ చాలా రోజుల తరువాత కలిశాడేమో, అప్పుడే వెళ్ళిపోయా డంటే ఎందుకో కంట్రోల్ చేసుకో లేక పోతున్నాను" ఇడ్లీ ప్లేటు దగ్గరకు తీసుకుంటూ జవాబిచ్చింది భారతి, మధ్య మధ్యలో ఏవో ఒకటి రెండు మాటలు మాట్లాడినా దాదాపు మౌనంగా టిఫిన్ తినడం ముగించింది భారతి.

"యింక వెళ్తాన్నేను. యిక్కడ దాకా తీసుకొచ్చి టిఫిన్ పెట్టించి నందుకు చాలా థాంక్స్" అంది భారతి చిన్నగా నవ్వుతూ. రిక్షా కోసం చూస్తున్న భారతి వంక సీరియస్‌గా చూస్తూ వుండిపోయాడు ప్రసాద్.

"సారీ భారతీ! రాత్రి సారథి గార్ని నా రూమ్‌కి తీసుకు వెళ్ళడం మూలాన మీరు ఏకాంతంగా వుండడాని కవకాశం లేకుండా చేశానేమో కదూ!" అతనలా సడెన్‌గా అడిగేసరికి చివ్వున అతని వైపుకు తిరిగింది.

"ఏమిటి మీరనేది?" విస్మయంగా ప్రసాద్ వంక చూసింది భారతి.

"సారథి వున్న ఒక రాత్రిని మీకు కాకుండా చేశానే అని". ప్రసాద్ చూపులో మార్పు. అతని మాటల్లోని శ్లేష గుర్తించి తృళ్ళి పడింది భారతి.

"వాడ్డూ యూ మీన్?" కంఠం కరుకుగా వున్నా భారతి ముఖం పాలిపోయింది. కాని అతనిలో నిద్రలేస్తున్న రాక్షసుడికి వివేకం, జాలి రెండూ లేకుండా పోయాయి. అతని హృదయానికి, మెదడుకి నోటికి మధ్య నున్న కనెక్షన్స్ తెగిపోయి నోరు యిష్టం వచ్చినట్లు స్వతంత్రంగా మాట్లాడేసింది.

"ఈ రాత్రికి నన్ను సారధి అనుకోకూడదూ?" ఆకాశం విరిగి తన మీద పడితే బావుండు! భూమి రెండుగా చీలి తనని దాచుకుంటే బావుండు ననిపించింది భారతికి. తను ఎంతో సహృదయుడు స్నేహపాత్రుడూ అని నమ్మిన వ్యక్తి యితను. ఆడ, మగ కలిసి నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూంటే చూసీ చూడనట్లు ఊరుకునేంత వరకే ఎదిగింది సమాజం. ఆడ, మగ స్నేహం తాలూకు గాఢానుభూతుల్ని పంచుకుంటూంటే అవి శరీర సంబంధాలకు అతీతంగా వుండగలవని నమ్మేంత వరకూ ఈ సమాజం ఎదగలేదని తనకు తెలుసు! కాని మామూలు సమాజం కంటె ఉన్నతుడిగా కన్పిస్తున్న యితను కూడా తమ బాంధవ్యాన్ని సమాజపు చత్వారపు కళ్ళతోనే చూశాడే! తనను ఎంత హీనంగా అంచనా వెయ్యక పోతే యింత జుగుప్సాకరంగా మాట్లాడ గలుగుతాడు!

"భారతీ!" ప్రసాద్ చెయ్యి తన భుజం మీద పడగానే అంత చలిలోనూ తన శరీరాన్ని బాయిలర్‌లో పడేసినట్లు ఫీలయింది భారతి.

"ప్రసాద్‌గారూ! యింకా మీ సంస్కారం మీద పూర్తిగా నమ్మకం పోలేదు నాకు. స్నేహ మనేది శరీర సంబంధాలకు మించిన అనుబంధమని నమ్మగలిగిన రోజున మళ్ళీ నన్ను పలకరించండి" తన చేతిని పురుగును విదిలించినట్లు విదిలించేసి వడివడిగా వెళ్ళి పోతున్న భారతిలో ఆధునిక స్త్రీలోని ఒక కొత్త కోణాన్ని దర్శించ గలిగాడు ప్రసాద్. ●